క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతలకు సత్కారం



మాజీ మంత్రి, ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న హబీబుల్లా ఖాన్

నిడదవోలు: స్థానిక రోటరీ ఆడిటోరియంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ నియోజక వర్గ విస్తృతస్థాయి సమావేశంలో పలువురు నాయకులను ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, రాజమండ్రి పార్లమెంటరీ ఇంఛార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాసరావులను మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి.హబీబుల్లాఖాన్ సత్కరించారు. స్థానిక మైనార్టీ నాయకులతో కలిసి పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెల్ అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు అరిఫుల్లాఖాన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నిజాం, రూరల్ మైనార్టీ నాయకులు నిసారబ్బాస్. సర్కార్ భాష, నిడదవోలు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో నేల సారవంతం

చాగల్లు: మండలంలో బ్రాహ్మణగూడెం, కలవలపల్లి గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొవ్వూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఈజీ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మారాలన్నారు. పచ్చి రొట్ట, పెసర, జనుము వంటి పంటలను సాగు చేయడంతో నేలలో కర్బన శాతాన్ని పెంచి ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పంటను చీడపీడలకు గురికాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఖరీఫ్ కాలానికి అవసరమైన ఎరువును మండలంలోని అన్ని సొసైటీల వద్ద అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ గారపాటి విజయ దుర్గ, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, వీఏఓ వనిత, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఆత్మహత్య



వరసాల అబ్రహం లింకన్ (ఫైల్)

నిడదవోలు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ దివ్యాంగుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలోని దానమ్మగుడి సెంటర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు పట్టణంలో ఓ హోటల్‌లో పనిచేస్తున్న వరసాల అబ్రహంలింకన్ (57) గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు 15 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని పట్టణ ఎస్సై జగన్ మోహన్‌రావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలో యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని కలవచర్ల గ్రామానికి చెందిన నల్లమాటి శ్రీహర్ష అనే యువకుడు ఈనెల 8వ తేదీన ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పాఠశాలలోనే బాల్యం గడిచిపోతుంది

పెరవలి: ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మధ్య సత్సంబంధాలు బాగుంటే విద్యార్థుల ఉజ్వల భవిషత్ కోసం అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని మండల ప్రత్యేక అధికారి సునీల్ తెలిపారు. మండలంలోని కాకరపర్రు ఉన్నత పాఠశాలలో మోగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం, యవ్వనం పాఠశాలలోనే గడిచిపోతుందని వారిని సరైన సత్ప్రవర్తనలో పయనించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వ్యవహరించాలన్నారు. ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు బాధ్యత తీసుకుంటే సక్రమ మార్గంలో పయనిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిరంజన్, ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీరామ చంద్రమూర్తి, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు గుడాల రంగారావు, విద్యాకమిటీ చైర్మన్ దుర్గ పాల్గొన్నారు.

మిస్టర్ సోల్జర్ విజయం సాధించాలి

నిడదవోలు: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మిలటరీ మాధవరం గ్రామాన్ని ఆదర్శంగా చేసుకొని దర్శకుడు బాలాజీ ముత్యాల దర్శకత్వంలో వెండితెరపై దేశ సైనికుల గొప్పతనాన్ని వివరించేలా చిత్రీకరించిన మిస్టర్ సోల్జర్ చిత్రం అఖండ విజయం సాధించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. పట్టణంలో కాపు కళ్యాణ మండపంలో గురువారం రాత్రి నిర్వహించిన మిస్టర్ సోల్జర్ చిత్రం ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ గ్రామం నుంచి ఎంతోమంది దేశరక్షణలో సైనికులుగా తమ వంతు పాత్ర పోషించారని చిత్రం మంచి విజయం సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, శ్రేణులు



సమావేశంలో ప్రసంగిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, చిత్రంలో ఇంచార్జ్ జి. శ్రీనివాస్ నాయుడు, జక్కంపూడి రాజా



బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వేణు, ఇంచార్జిలు, పార్టీ నాయకులు

- చంద్రబాబు ఓ అబద్ధాల ఫ్యాక్టరీ
- కూటమి పాలనలో ఏ వర్గానికి మేలు జరగడం లేదు
- హెలికాప్టర్లలో తిరగడమే సరిపోతుంది

నిడదవోలు: మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావస్తున్నా చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఏవిధంగా మోసపోయారో నేరుగా తెలియచేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో గురువారం మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గ ఇన్‌చార్జి జి. శ్రీనివాస్ నాయుడు అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ విస్తతస్థాయి సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

నీకు ఎంత..నాకు ఎంత

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధపు కంపెనీ పెట్టి దానికి ఎండీగా ఉంటూ, డైరెక్టర్లగా పవన్ కళ్యాణ్, లోకేష్, మీడియా ప్రతినిధులను పెట్టుకొని హామీలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు.

కూటమి పేరుతో రాజకీయ వ్యాపారం చేస్తున్నారని, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత ఇసుక ఇలా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. మద్యంలో ఎమ్మెల్యేలకు ఇంత, ఇసుకు లారీకి ఇంత అంటూ అవినీతికి పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో ఏ వర్గానికి మేలు జరగడం లేదని, గిట్టుబాటు ధరలు లేక మామిడి, ఆక్వా, పొగాకు మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జగన్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రూ.30 వేల కోట్లను మహిళల ఖాతాల్లో వేశామని, 31 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చామని గుర్తు చేశారు. కూటమి పాలనను చూసిన ప్రజలంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే బాగుందని భావిస్తున్నారన్నారు.

జగన్ సీఎం అయ్యేంతవరకు పాటుపడాలి

రాష్ట్రంలో సంక్షేమ ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేసేందుకు మళ్లీ జగన్ సీఎం అయ్యేలా ప్రతి కార్యకర్త పాటుపడాలని, ఈ నాలుగేళ్లలో కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. ప్రభుత్వంలో మైనర్ బాలికలు, మహిళలపై జరుగుతున్న దారుణాలను ఎందుకు ప్రశ్నించడం లేదని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నియోజకవర్గ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కొండంత అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సమన్వయకర్త గూడూరు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామశెట్టి వెంకట సత్యనారాయణ, మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలగడ బాలరాజు, పెరవలి మండల అధ్యక్షుడు గండేపల్లి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు విరమళ్ల సత్యనారాయణ, ఎంపీపీలు కార్చెర్ల ప్రసాద్, పాలాటి ఎల్లారీశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు నందిగామ భాస్కర్ రామయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మానుకొండ చంద్రబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌కే ఖాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఏదీ..?

పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 ఇస్తామని మోసం చేశారు. ఈ లెక్కన ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.36,000 వేలు చంద్రబాబు బాకీ పడ్డారని గుర్తు చేశారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు రూ.18,000 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 1.59 కోట్లు బాకీ ఉన్నారని గుర్తు చేశారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.20,000, మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని గాలికి వదిలేసిందన్నారు. మూడు గ్యాస్ సిలిండర్లని చెప్పి ఒక్క సిలిండర్‌తో సరిపెట్టారని విమర్శించారు. మార్పు.. మార్పు అంటూ చెప్పిన నాయకులు హెలికాప్టర్లలో తిరగడమే సరిపోతుందన్నారు. నియోజవర్గంలో ఒక్క పని కూడా చేయలేదని, పార్టీ కండువాలు మార్చడంలో మాత్రం ముందుంటున్నారని ఆయన ఆరోపించారు. కార్యకర్తలకు నేనున్నానని ఆయన భరోసా ఇచ్చారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు పూర్వ విద్యార్థుల సహకారంతో నెరవేరింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన శుద్ధి చేసే గోదావరి నీరు పంపిణీ ట్యాంక్‌లను ఎమ్మెల్యే ముప్పడి వెంకటేశ్వరరావు, ఆర్డీవో డా.రాణి సుస్మితల చేతులు మీదుగా గురువారం ప్రారంభించారు. ప్రాథమిక, ఉన్నత, జూనియర్ కళాశాలకు చెందిన సుమారు 700 మంది విద్యార్థులకు తాగు నీటి అవసరాలు తీర్చడానికి శీర్ల సత్యనారాయణ చొరవతో పూర్వ విద్యార్థులు తమ వంతు ఆర్థిక సాయంతో పైప్ లైన్‌ను నిర్మించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి లావణ్య, డీఎల్‌పీవో వై.అమ్మాజీ, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఎంఈవో సీహెచ్ బాలామణి, పూర్వ విద్యార్థులు జొన్నగడ్డ సుబ్బరాయ చౌదరి, కైగాల శ్రీనివాసరావు, ఇందుగుల రామకృష్ణ, సూరపనేని చిన్ని, అడ్డాల డేవిడ్‌రాజు, శీర్ల ప్రసాద్, దేవన సత్తిబాబు, మేడా సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో, పూర్వ విద్యార్థులు

రైతుల సహకారంతోనే సొసైటీల అభివృద్ధి

తాళ్లపూడి: రైతుల పరస్పర సహకారంతోనే సొసైటీలు అభివృద్ధి చెంది రైతుల అవసరాలను తీర్చడానికి అవకాశం ఉంటుందని గోరిజాల వెంకట ప్రసాద్ అన్నారు. అనపన్నదేవరపేట సహకారం సంఘం చైర్మన్‌గా గురువారం సభ్యులు చేవూరి బంగార్రాజు తదితరులతో కలిసి ఆయన బాధ్యతలు స్వీకరించారు. రైతులు, సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొసైటీలు లాభాల బాట పట్టేలా చూస్తానని హామీ ఇచ్చారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు కొరత లేకుండా సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకొంటామన్నారు.

– తాడిపూడి సొసైటీ చైర్మన్‌గా నామా కొండబాబు, ఇద్దరు సభ్యులతో కలిసి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షరాలు ఉమా, పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు ముళ్లపూడి రామచంద్రం, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి లక్ష్మణరావు, గణపతి కృష్ణ, సొసైటీ కార్యదర్శి పి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



అన్నదేవరపేట సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట ప్రసాద్

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో వార్షిక నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సరఫరా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. 33/11 కేవీ పల్లంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని కావున ప్రజలు సహకరించాలన్నారు.

పెరవలి: మండలంలోని మల్లేశ్వరం, ఎస్‌వీఆర్ ఫీడర్ల పరిధిలోని చెట్టుకొమ్మలు నరికివేత, విద్యుత్ లైన్ల మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుదల చేస్తున్నామని ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం, కడింపాడు, ఖండవల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందని రైతులు, వినియోగదారులు సహకరించాలని సూచించారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తాడిమళ్ల, కోరుమామిడి, అమ్మేపల్లి, మేడిపల్లి గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతుల దృష్ట్యా ఈనెల 11 తేదీ శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సంబంధిత గ్రామాల విద్యుత్ వినియోగదారులంతా సహకరించాలన్నారు.

చాగల్లు: మండలంలోని 33 కెవి చాగల్లు, గౌరిపట్నం ఫీడర్లు మరమత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు చాగల్లు, మీనానగరం, నెలటూరు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, దారవరం, నందిగంపాడు, కుంకుడుమిల్లి గ్రామాలకు గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో మోర్త, దమ్మెన్ను, పాలంగి, వెలగదుర్రు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. మెయింటెనెన్స్, చెట్టు కొమ్మలు తొలిగించే పనుల నిమిత్తం పై గ్రామాల్లో సరాఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 33 కేవీ నిడదవోలు, పెరవలి ఫీడర్ మెయింటెనెన్స్ నిమిత్తం ఉండ్రాజవరం మండలం మొత్తం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరాఫరా అంతరాయం ఉంటుందన్నారు.

కడియాలమ్మకు సారె సమర్పణ

దేవరపల్లి: స్థానిక గ్రామ దేవత కడియాలమ్మ అమ్మవారికి ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని భక్తులు సారెను గురువారం అందజేశారు. గ్రామానికి చెందిన ప్రముఖ జీడిపప్పు వ్యాపారి పెంజర్ల గణేష్ కుమార్, లక్ష్మీ భవాని దంపతులు అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి, 11 రకాల స్వీట్లు, పండ్లు, చీర, పసుపు, కుంకుమ, చలివిడి, పానకంతో సారెను అందజేశారు. అనంతరం అమ్మవారికి నివేదన చేసి భక్తులకు స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామ దేవతకు సారె సమర్పించడం ఇదే తొలిసారి అని స్థానికులు పేర్కొన్నారు.



కడియాలమ్మకు సారె సమర్పిస్తున్న గణేష్ కుమార్ దంపతులు



శాకంబరిగా దర్శనమిస్తున్న రాజరాజేశ్వరీ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో షిర్డీసాయి బాబా మందిరాలు భక్తులతో కిటకిటాలాడాయి. దేవరపల్లి, యర్నగూడెం, దుద్దుకూరు గ్రామాల్లోని బాబా మందిరాలు భక్తులతో కిక్కిరిసాయి. భక్తులు సమర్పించిన 108 రకాల పిండి వంటలను నివేదన చేశారు. 108 లీటర్ల ఆవుపాలు, కలశాలతో తీసుకు వచ్చిన గోదావరి జలాలతో బాబా మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం భక్తులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయి బాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తాళ్లపూడి, పెద్దేవం, వేగేశ్వరపురం, గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. తాళ్లపూడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోగల సాయిబాబా ఆలయంలో అర్చకులు చేబ్రోలు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో సాయిబాబాకు పంచామృతాలతో, సుగంధద్రవ్యాలు, విభూతితో అభిషేకాలు, అన్నాభిషేకం, పల్లకీసేవ, కాకడ హారతి, సేజ్ హారతి, సంధ్యహారతి, హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

శాకంబరిగా అమ్మవారి దర్శనం

దేవరపల్లి: ఆషాఢమాసం, గురుపూర్ణిమ సందర్భంగా గురువారం మండలంలోని పల్లంట్లలో వేంచేసియున్న రాజరాజేశ్వరీ సమేత దుర్గా మల్లేశ్వరి ఆలయంలో అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో భక్తులు అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు బలుసు సత్యనారాయణ, విజయలక్ష్మి దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు వై. సుజనా శర్మ పంచామృతాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దండు గంగాభవానీ అమ్మవారికి ఆషాఢం సారె

నల్లజర్ల: అనంతపల్లి గ్రామ ప్రజల ఆరాధ్యదైవం, గ్రామ దేవత దండు గంగాభవానీ అమ్మవారికి ఆషాఢ మాస పౌర్ణమి సందర్భంగా గురువారం భక్తులు సారె సమర్పించారు. అమ్మవారిని శాకంబరిగా అలంకరించి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి మహిళలు తమ వెంట తీసుకు వచ్చిన పసుపు, కుంకుమ, పళ్లు, పూలు సమర్పించారు.

డ్రోన్‌తో పట్టేసిన పోలీసులు

పెరవలి: మండల కేంద్రం పెరవలిలోని పంట పొలాల మధ్య రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ తనిఖీల్లో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నామని పెరవలి ఎస్సై యం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పేకాట ఆడుతున్నారని సమాచారం రావటంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా జూదరులు పారిపోయి సమీపంలోని పొలాల్లో దాక్కున్నారన్నారు. దీనితో డ్రోన్‌తో నిఘా ఉంచి ఎక్కడ ఉన్నారో గుర్తించి 10 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.5,520 నగదును సీజ్ చేశామని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

కార్యకర్తల కుటుంబాలకు తలారి పరామర్శ

చాగల్లు: దారవరంలో ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు గురువారం పరామర్శించారు. ఉప సర్పంచ్ మద్దాల మోషే సోదరుడు ఆగమనరావు ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మరో నలుగురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో దారవరం సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, పార్టీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం

తాళ్లపూడి (కొవ్వూరు): తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కనెక్ట్ అవ్వడానికి పీటీఎం సమావేశాలు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని పీఎంఎం హైస్కూల్, హోలీ ఏంజిల్స్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. పిల్లల విద్యా పురోగతి గురించి చర్చించడానికి అభ్యాస సామర్థ్యాన్ని ప్రోత్సహించడానికి వ్యూహాలను అభివృద్ధి చేయడానికి అవకాశం లభిస్తుందని పిల్లలకు విజయవంతమైన విద్యా అనుభవాన్ని పెంపొందించడానికి తల్లిదండ్రుల-ఉపాధ్యాయ సమావేశం చాలా అవసరమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ నెల్సన్ ఆంటోని, చైర్ పర్సన్ భావరత్నాకుమారి టుమెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, ఎస్.చిన్ని పాల్గొన్నారు.

తల్లులకు పాదపూజ

తాళ్లపూడి మాంటిస్సోరీ హైస్కూల్ వద్ద నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విద్యార్థులతో తల్లులకు పాదపూజ నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్ విద్యార్థులకు తల్లిదండ్రులు మొదటి గురువని సృష్టిలో తల్లిదండ్రులను మించిన దైవం లేదని, నవ మాసాలు మోసి, జన్మనిచ్చి ,లోకాన్ని చూపించే తల్లి కనిపించే దైవమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రేమకు లోకంలో ఏది సాటి లేదన్నారు. తల్లిదండ్రులను సేవించడం ద్వారాపుణ్యఫలం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణం జరగాలి

దేవరపల్లి: పాఠశాలల్లో విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణం జరగాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గ స్థాయి మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ (పీటీఎం) గురువారం దేవరపల్లి మండలం దుద్దుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం వీర్రాజు అధ్యక్షతన జరిగింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల వ్యక్తిత్వ నిర్మాణానికి ఆలోచన చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి విద్యార్థి వ్యక్తిత్వ నిర్మాణం పాఠశాల్లో జరుగుతుందని, ఇది మార్కులతో సాధించేది కాదని హితవు పలికారు. కార్పొరేట్ పాఠశాలల్లో ఈ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రధానోపాధ్యాయులు వీర్రాజు మాట్లాడుతూ మూడో తరగతి గదుల నిర్మాణం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పాఠశాలలో మౌలిక వసతులు లేనందున పాఠశాల 3 స్టార్‌లో ఉందని, 430 మంది విద్యార్థులున్నప్పటికి టాయ్‌లెట్లలో రన్నింగ్ వాటర్ సదుపాయం లేదని, మహిళలు, పురుషుల ఉపాధ్యాయులకు ఒకే టాయ్‌లెట్ ఉన్నందున ఇబ్బంది పడుతున్నట్లు ఆయన సూచించారు. వేర్వేరుగా నిర్మాణం చేయాలని కోరారు. పంచాయతీ నిధులతో కొత్తగా టాయ్‌లెట్స్ నిర్మాణం చేస్తామని ఉపసర్పంచ్ కె.రవికుమార్ హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి ఎం.తిరుమలదాస్, సర్పంచ్ బొంతా నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్ పీటీఎం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు



తాళ్లపూడిలోని మాంటిస్సోరీ హైస్కూల్‌లో తల్లుల పాదాలను కడుగుతున్న విద్యార్థులు

ఉన్నత స్థాయికి ఎదగాలి

ఉండ్రాజవరం: మండలంలో ఉన్నత, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రాఫీ మంత్రి కందుల దుర్గేష్, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, తాడిపర్రు ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కరరామయ్య, ఉండ్రాజవరం ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి పాల్గొన్నారు.

81పాఠశాలల్లో వేడుకలు

నల్లజర్ల: మండల పరిధిలోని 81 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం మెగా టీచర్స్- పేరెంట్స్‌డే వేడుకలు జరిగాయి. వివిధ రాజకీయ ప్రముఖలతో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. దూబచర్ల జడ్పీహైస్కూలులో తహసీల్దార్ నాయుడు, ఎంపీడీఓ సింహాద్రి,సమగ్రశిక్షా అభియాన్ ఏఇ రాజ్‌కుమార్,హెచ్‌ఎం సుమతీ పాల్గొన్నారు.

మండలంలో పీటీఎం సమావేశాలు

చాగల్లు: మండలంలో మెగా పీటీఎంలో భాగంగా 38 ప్రభుత్వ, 13 ప్రైవేటు పాఠశాలల్లో సమవేశాలు నిర్వహించినట్టు ఎంఈవోలు కెవిఎస్ రామాంజనేయులు, సిహెచ్ శుభాకర్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం జరిగిన సమావేశాల్లో తల్లిదండ్రులు ఆయా పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి నివేదికను తల్లిదండ్రులకు అందించారని తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నిడదవోలు రూరల్: విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. సమిశ్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎ.దుర్గేష్ హాజరై విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులను వివరించారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా టీచర్స్,పేరెంట్స్ ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు.

జనసేన ఇన్‌చార్జి రామారావు తొలగింపు

దేవరపల్లి: కొవ్వూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బాధ్యతల నుంచి టీవీ రామారావును తొలగిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గురువారం సాయంత్రం పార్టీ హెడ్ కాన్సిల్ మేనేజ్‌మెంట్ వేములపాటి అజయ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. పార్టీ విధి విధానాలకు భిన్నంగా టీవీ రామారావు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు పార్టీ దృష్టికి వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలు ఉన్నందున నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తక్షణం తప్పించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తుది నిర్ణయం తీసుకొనే వరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు.